

ఊరూవాడా పింఛన్ల పండగ

- ఉదయం 6 గంటల నుంచే పంపిణీ
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, సచివాలయ సిబ్బంది
- పింఛనుదారుల్లో ఆనందం

(ఆంధ్రజ్యోతి బృందం)

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం పండగలా జరిగింది. దసరా, దీపావళి, సంక్రాంతి పండగల తరహాలో ఊరూవాడా సందడి నెలకొంది. బాణసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచిపెడుతూ, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ ఎక్కడ చూసినా పండగ వాతావరణం కనిపించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్లను రూ.4వేలకు పెంచారు. దీనికి మూడు నెలల బకాయి రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలు లబ్ధిదారులకు అందజేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో జై చంద్రబాబు అంటూ పింఛన్‌దారులు నినాదాలు చేశారు. కోటబొమ్మాళి మండలం తర్లిపేటలో మంత్రులు అచ్చెన్నాయుడు, రాంప్రసాద్ రెడ్డి, శ్రీకాకుళం నగరంలోని చౌదరిసత్యనారాయణ కాలనీలో ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట పట్టణం హుడ్కోకాలనీలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, సోంపేట మండలం లక్కవరంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాస పట్టణంలోని సూదికొండకాలనీలో ఎమ్మెల్యే గౌతు శిరీష, రణస్థలం మండలం కొండములగాంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు, ఆమదాలవలస మండలం కొర్లకోటలో ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎల్.ఎన్.పేట మండలం యంబరాంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, రణస్థలం మండలం జేఆర్‌పురం కాపువీధిలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ పింఛన్లను పంపిణీ చేశారు. ఒకేసారి రూ.7వేలు అందడంతో పింఛన్‌దారులు ఆనందంతో ఉప్పొంగిపోయారు.



శ్రీకాకుళంలోని చౌదరిసత్యనారాయణ కాలనీలో వృద్ధురాలి ఆనందం



టెక్కలి: కోటబొమ్మాళి మండలం వాంగ్రాడలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అరసవల్లి: చౌదరి సత్యనారాయణకాలనీలో ఎమ్మెల్యే గొండు శంకర్..



నరసన్నపేట: హుడ్కోకాలనీలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి..



సోంపేట: లక్కవరంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్



రణస్థలం: జేఆర్‌పురం కాపు వీధిలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్

అండగా నిలిచారు



నాకు, కుటుంబానికి సీఎం చంద్రబాబు అండగా నిలిచారు. పదేళ్ల కిందట రైలు నుంచి జారిపడి వెన్నెముక దెబ్బతింది. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాను. కుటుంబ పోషణ భారంగా ఉన్న సమయంలో అప్పటిలో టీడీపీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు సీఎం అయిన తరువాత పింఛన్ మొత్తం రూ.15 వేలకు పెంచడంతో ఆనందంగా ఉంది. సీఎంకి కృతజ్ఞతలు.

-గొర్లె జగదీశ్వరరావు, గులుమూరు, హిరమండలం

ఆనందంగా ఉంది



సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటన నిలబెట్టుకున్నారు. పింఛన్ పెంచడంతో పాటు మూడు నెలల బకాయి రూ.3 వేలు కలిపి రూ.7వేలు అందించడం ఆనందంగా ఉంది. నా మందులకు రూ.4 వేలు పోను మూడు వేలు వరకు మిగులుతుంది. కుటుంబ అవసరాలకు సరిపోతుంది. అప్పుడు రూ.2వేలు పెంచారు.. ఇప్పుడు కూడా రూ.4వేలకు పెంచిన చంద్రబాబు రుణం తీర్చుకోలేం.

వెలమల నీలమ్మ, జమ్ము, నరసన్నపేట

మళ్లీ చంద్రబాబుకే ఓటేస్తా



మళ్లీ వచ్చే ఎన్నికల వరకు బతికి ఉంటే చంద్రబాబుకే ఓటు వేసి రుణం తీర్చు కుంటా. కూటమి ప్రభుత్వం అన్నమాట ప్రకారం పింఛన్ పెంచడం ఆనందంగా ఉంది.

-ఎల్.బైరాగి, బంజీరు, మెళియాపుట్టి



టెక్కలి: కోటబొమ్మాళి మండలం జీయన్నపేటలో పింఛన్ అందుకుంటున్న 108 ఏళ్ల బాడాన సత్యవతమ్మ

జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు

- మంత్రులు అచ్చెన్నాయుడు, రాంప్రసాద్‌రెడ్డి

టెక్కలి, జూలై 1: ఐదేళ్ల అధికారంలో ఉన్న జగన్‌రెడ్డి సంక్షేమాన్ని మరిచి రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం కోటబొమ్మాళి మండలం తర్లిపేట, వాంగ్రాడలో రవాణా, క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6 హామీల మేరకు అర్హులందరికీ పింఛన్లు పెంచి అందజేసినట్లు తెలిపారు. 'రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను జగన్‌రెడ్డి నాశనం చేశారు. వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులుపాలు చేసింది. దొరికిన కాడకు గత సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకున్నారు. ఎన్నికల సమయంలో సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయాలని మేము కోరినప్పటికీ జగన్‌రెడ్డి వినలేదు. మొండివైఖరితో లబ్ధిదారులను ఎండలో బ్యాంకుల చుట్టూ తిప్పించారు. దీని ఫలితంగా రాష్ట్రంలో 35మంది మృత్యువాతపడ్డారు. అదే సచివాలయ వ్యవస్థ ద్వారా నేడు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో ఏ నెల పింఛన్ ఆ నెలే తీసుకోవాలి. లేదంటే ఆ సొమ్మును లబ్ధిదారులు నష్టపోయేవారు. ఈ ప్రభుత్వం మాత్రం మూడునెలలకు ఒకసారి పింఛన్ తీసుకునే అవకాశాన్ని కల్పించింది.' అని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్‌కుమార్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, అప్పన్న, నంబాళ్ల శ్రీనివాస్, నంబాళ్ల రాజశేఖర్, కర్రి అప్పారావు, కింజరాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 97శాతం పంపిణీ

కలెక్టరేట్: జిల్లాలో సోమవారం 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలను ప్రత్యేకంగా అభినందించారు. తన కార్యాలయంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వంశధార ఎడమ కాలువ నుంచి సోమవారం నీటిని విడుదల చేశామని, షట్టర్లు దెబ్బతిన్న చోట తాత్కాలికంగా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశామని వంశధార ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నానికి పలాస జగన్నాథపురం సాగరం వరకు నీటిని తీసుకువెళ్తామని వివరించారు. రానున్న వారం రోజులు వంశధార కాలువలు, ఇతర సాగునీటి కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పనులకు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, ఇతర శాశ్వత ప్రయోజనం కలిగే పనుల ప్రతిపాదనలు వెంటనే అందజేయాలని ఆదేశించారు. పనులు జరుగకుండా బిల్లులు చేసినా, ఉపాధి మస్టర్లలో అవకతవకలు జరిగినా సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డ్వామా పీడీ చిట్టిరాజు, డీపీవో వెంకటేశ్వరరావు, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటరామన్, వంశధార ఈఈ శేఖర్, ఉద్యానవన అధికారి ప్రసాదరావు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మెళియాపుట్టిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న వృద్ధులు



ఆమదాలవలస: కొర్లకోటలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



పలాస: సూదికొండ కాలనీలో ఎమ్మెల్యే గౌతు శిరీష



ఎల్‌ఎన్‌పేట: యంబరాంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



రణస్థలం: కొండములగాం గ్రామంలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

వంశ'ధార' వస్తోంది

- ఎడమ ప్రధాన కాలువల ద్వారా సాగునీరు విడుదల
- శివారు భూములకూ అందిస్తాం: ఎమ్మెల్యే గోవిందరావు

హిరమండలం, జూలై 1: ఖరీఫ్ సాగుకు వంశధార నీరు కదలివస్తోంది. రైతుల్లో ఆశలు చిగురించేలా కాలువ నుంచి పరుగులు తీస్తోంది. సోమవారం ఉదయం 8 గంటలకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి గొట్టాబ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ హెడ్‌రెగ్యులేటర్ గేట్లు పైకెత్తి నీటిని విడుదల చేశారు. ఈ ఖరీఫ్‌లో రైతులు ఎలాంటి కష్టాలు ఎదుర్కోకుండా శివారు భూముల వరకూ సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో ఎడమ కాలువ 104 కిలోమీటర్ల మేర ఉంది. దీని పరిధిలో హిరమండలం, సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస మండలాలు ఉన్నాయి. మొత్తం 12 మండలాల పరిధిలో 398 గ్రామాల్లోని 1,48,200 ఎకరాలకు సాగు నీరు అందనుంది. అలాగే, 584 చెరువులను నీటితో నింపనున్నారు. ఎడమ కాలువ ద్వారా ముందుగా 700 క్యూసెక్కులు నీటిని విడిచి పెట్టామని, క్రమేపీ పెంచుకుంటూ వారంలో పూర్తి స్థాయిలో విడిచి పెడతామని గొట్టాబ్యారేజీ డీఈఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి నదిలోకి ఇన్‌ఫ్లో 750 క్యూసెక్కులు వస్తుందన్నారు. గొట్టా బ్యారేజి గేట్లు అన్ని మూసివేశామని, బ్యారేజి వద్ద నీటి మట్టం 37.8 మీటర్లు వరకు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎడమ ప్రధాన కాలువల పరిధిలోని శివారు భూములకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా ఈ ఏడాది అన్ని చర్యలు తీసుకుంటున్నామ న్నారు. విడిచి పెట్టిన నీటిని ముందుగా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని శివారు ఆయకట్టుకు పంపిస్తామన్నారు. కుడి కాలువలో ప్రస్తుతం ఉపాధి హామీ ద్వారా పూడిక తీత, గుర్రపు డెక్క తొలగించే పనులు జరుగుతున్నాయని, దీని కారణంకా నీటివిడుదలకు మరికొన్ని రోజుల సమయం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గొట్టాబ్యారేజీ హెడ్‌రెగ్యులేటర్ గేట్లు పైకెత్తుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



ఎడమ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న సాగు నీరు

ప్రజారవాణా వ్యవస్థను గాడిలో పెడతా

- మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి

టెక్కలి, జూలై 1: ప్రజారవాణా వ్యవస్థ(ఆర్టీసీ)ను తిరిగి గాడిలో పెడతానని రవాణా, క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం నిమ్మాడలో రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆర్టీసీలో కార్గో సర్వీసులు పెంచి ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు. కాలం చెల్లిన బస్సులు పక్కన పెడతామని, ఆదాయ వనరులు వచ్చే రూట్లను పరిశీలించి బస్సులు తిరిగేటట్లు చూస్తామని అన్నారు. త్వరలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లను పలుచోట్ల ఆధునికీకరించి సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టెక్కలి డిపో కార్మిక సంఘ ప్రతినిధులు బడే మురళి, జి.భూషణరావు, కె.దశరథుడు, మూర్తి, ఎస్ఆర్ కుమార్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ప్రజారవాణా శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సి.రవికుమార్, బ్రహ్మానందరెడ్డి, రవివర్మ, చంద్రశేఖరరావు, జిల్లా ప్రజారవాణా అధికారి విజయ్‌కుమార్, డిపో మేనేజర్ శ్రీనివాసరావు, డీటీసీ ఎ.చంద్రశేఖరరెడ్డి, ఆర్‌టీవో దేవి, ఎంవీఐలు డి.సంజీవరావు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆర్టీసీ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, అచ్చెన్నాయుడు

'మీ కోసం' అర్జీలు సత్వర పరిష్కారం

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, జూలై 1: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమానికి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. జేసీ ఎం.నవీన్‌తో కలిసి 204 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాణ్యతతో పాటు నిర్దేశించిన సమయంలోగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. న్యాయ సంబంధమైన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఉప కలెక్టర్ రామ్మోహన్‌రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటరామన్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, ఇరిగేషన్ ఎస్.ఈ రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

శ్రీకాకుళం క్రైం: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు ప్రాధాన్యం ఇచ్చి, బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో 29 అర్జీలు స్వీకరించారు. వీటిలో కుటుంబ తగాదాలపై ఒకటి, ఆస్తి తగాదాలపై మూడు, మిస్సింగ్ కేసు ఒకటి, సివిల్ తగాదాలపై తొమ్మిది, ఇతర తగాదాలపై 15 ఫిర్యాదులు వచ్చాయి. ఏఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దిక్సూచి DIKSUCHI

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)-'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఈ ప్రోగ్రామ్‌ను ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ఆన్‌లైన్ అసెస్‌మెంట్, అసైన్‌మెంట్, ప్రజంటేషన్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, క్విజ్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్నల్&ఫైనల్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైమ్ యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఫ్రెషర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

కోర్సు వివరాలు

- వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్ 30 గంటలు, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్నల్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** iift.ac.in

జేఎన్‌టీయూఏలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్



అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్ (బీటెక్&బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూఏ-కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్‌ఈ విభాగంలో 20 సీట్లు, ఈసీఈ విభాగంలో 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

- జేఎన్‌టీయూఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చదవాల్సి ఉంటుంది.
- బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో సీఎస్‌ఈ అభ్యర్థులకు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు; ఈసీఈ అభ్యర్థులకు మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్ ఉంటాయి.

అర్హత

- బీఐఈ(ఏపీ)/సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- పూర్తిచేసిన దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 29న
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ అలూమ్నీ మ్యాటర్స్ కార్యాలయం, జేఎన్‌టీయూఏ, అనంతపురం.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, జేఎన్‌టీయూఏ, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515002
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, dfaam@jntua.ac.in
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

ఐఐటీ మద్రాస్‌లో ఎంబీఏ- డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్

మద్రాస్‌లోని ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ప్రపంచంలోనే తొలిసారిగా వినూత్నమైన కోర్సు 'డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్'ని అందుబాటులోకి తెచ్చింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థ యాజమాన్య పద్ధతుల్లో ఎదురయ్యే సంక్లిష్టతలను అధిగమించేందుకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఈ కోర్సు ద్వారా పెంపొందించుకోవచ్చు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సును ఐఐటీ మద్రాస్‌కి చెందిన డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ రూపొందించాయి. తొలి బ్యాచ్ 2024 సెప్టెంబరులో ప్రారంభం కాబోతుంది.

- **ఎంబీఏ ఇన్ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్**

వ్యవధి: రెండేళ్లు.

ప్రోగ్రామ్ వివరాలు: ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్ చెయిన్ వంటి డిజిటల్ టెక్నాలజీపై నైపుణ్యాలు సాధిస్తారు. 900 గంటలు క్లాస్ రూమ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. కోర్సుకి మొత్తం 192 క్రెడిట్స్ నిర్దేశించారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఆన్‌లైన్, ఆన్ క్యాంపస్ మాడ్యుల్స్ అందుబాటులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తరవాత ఐఐటీ మద్రాస్ ఆలూమ్నీ స్టేటస్ కూడా లభిస్తుంది. అదేవిధంగా ఐఐటీ మద్రాస్ ఇన్‌క్యుబేషన్ అండ్ స్టార్టప్ ప్లాట్‌ఫాం ద్వారా ఉద్యోగవకాశాలు పొందే సౌలభ్యం కూడా ఉంది.

అర్హత: అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల పూర్తి స్థాయి(ఫుల్ టైం) పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేస్తారు. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కోర్సు ఫీజు: రూ.9,00,000. వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. అర్హులైన వారికి బ్యాంక్ రుణ సదుపాయం కూడా ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.iitm.ac.in/



జాబ్ కార్నర్ హిందుస్థాన్ కాపర్‌లో జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్..వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ మేనేజర్

ఖాళీలు: 56

విభాగాలు: మైనింగ్, ఎలక్ట్రికల్, కంపెనీ సెక్రటరీ, ఫైనాన్స్, హెచ్‌ఆర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి 40 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.30,000- రూ.1,20,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 21

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

ఎన్‌ఎఫ్‌ఎస్‌సీలో బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్)

నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్(ఎన్ ఎఫ్‌ఎస్‌సీ)- బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.


అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024లో అర్హత స్కోర్ ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 4న
- **అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపిణీ:** జూలై 5న
- **అడ్మిషన్స్ తేదీ:** జూలై 29
- **వెబ్‌సైట్:** https://nfscbtechadmissions. com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YFfr14Xలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

మాస్ మూమెంట్స్‌తో 'స్టెప్పామార్'



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ అందరికీ మంచి కిక్ ఇచ్చి.. సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను 'మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. 'స్టెప్పామార్' అంటూ సాగే ఈ పాట హై ఎనర్జిటిక్ మాస్ మూమెంట్స్‌తో సాగింది. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సాహితీ ఆలపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు మణిశర్మ సంగీతం అందించారు.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



వైవిధ్యమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకొంటున్న సుధీర్‌బాబు ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించనున్నారు. మన పురాణాలతో అనుసంధానం చేస్తూ ఎన్నో రహస్యాలను వెలికి తీసే కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇంతకుముందెన్నడూ రాని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి వెంట్ కల్యాణ్ దర్శకుడు. 'రుస్తుమ్', 'టాయ్‌లెట్', 'ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్‌మ్యాన్', 'పరి' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంటుంది. ఇందులో సుధీర్ బాబు సరసన బాలీవుడ్ కథానాయిక నటిస్తుంది. ఆమె ఎవరనేది త్వరలో తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. 'కుట్ర, పన్నాగాలతో మంచికి, చెడుకీ మధ్య జరిగే యుద్ధం ఈ చిత్ర ముఖ్యాంశం. పాన్ ఇండియా సినిమాల్లో ఓ మైల్ స్టోన్‌గా ఉంటుంది' అని చెప్పారు దర్శకుడు కల్యాణ్. ఈ సినిమా గురించి సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ నచ్చి ఏడాది నుంచి ఈ టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. డిఫరెంట్ కంటెంట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని ఆతృతతో ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. ఆగస్టు 15న ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామనీ, సినిమాను శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేస్తామనీ ప్రేరణ అరోరా చెప్పారు.

మిస్ యూనివర్స్‌తో 'క్యాలెండర్' సాంగ్



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్. టాప్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీ 12న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. సోమవారం ఈ సినిమా నుంచి 'క్యాలెండర్' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో దక్షిణాఫ్రికాకు చెందిన మోడల్, 2017 మిస్ యూనివర్స్ డెమి లీ టెబో నటించి.. పాటకే ప్రత్యేకార్షణగా నిలిచారు. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు.

'కోడి బుర్ర' కథ ఏమిటి?



తమిళ హీరో శ్రీరామ్ కొత్త చిత్రం 'కోడి బుర్ర' షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మొదలైంది. శ్రుతి మీనన్, ఆరుషి హీరోయిన్లుగా నటిస్తున్నారు. శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసిన అనంతరం నిర్మాత బెక్కం వేణుగోపాల్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్ ప్రారంభించారు. అనంతరం దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో శ్రీరామ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిన్ శ్రుతి మీనన్ డాక్టర్‌గా నటిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో చిత్రం రూపుదిద్దుకుంటుంది' అని చెప్పారు. ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని శ్రీరామ్ చెప్పారు.

యానిమేషన్ చిత్రానికి డాలర్ల పంట



యానిమేషన్ చిత్రం 'ఇన్‌సైడ్ అవుట్ 2' ప్రపంచవ్యాప్తంగా దుమ్ముదులుపుతోంది. చరిత్రలో ఇప్పటివరకూ ఏ యానిమేషన్ చిత్రం సాధించని అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది. కేవలం మూడు వారాల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద వన్ బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8500 కోట్లు) అర్జించింది. ఇటువంటి సంచలన రికార్డు సాధించడమే కాకుండా ఈ ఏడాది ఇప్పటివరకూ రిలీజైన అన్ని సినిమాల కలెక్షన్లను వెనక్కునెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తానికి వన్ బిలియన్ డాలర్లు కొల్లగొట్టిన 11వ యానిమేషన్ సినిమాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' చరిత్ర సృష్టించింది. ఇండియాలోనూ రిలీజైన ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల పైచిలుకు కలెక్షన్లను సాధించడం విశేషం. 2015లో ఈ సినిమా మొదటి భాగం 'ఇన్‌సైడ్ అవుట్' జూన్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పీట్ డాక్టర్ దర్శకత్వం వహించారు. 11 ఏళ్ల రిలే అండర్సన్ అనే బాలిక మెదడులోని భావోద్వేగాలైన ఆనందం, కోపం, చిరాకు, బాధ, భయం యానిమేషన్ రూపు సంపాదించుకుని.. ఆమె ఆలోచనల్ని, నిర్ణయాల్ని ఎలా ప్రభావితం చేస్తాయి అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్స్ దాదాపు 900 మిలియన్ డాలర్లు (రూ.7500 కోట్లు). ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కింది 'ఇన్‌సైడ్ అవుట్ 2'. జూన్ 14న విడుదలైన ఈ సీక్వెల్‌కు కెల్సీ మన్ దర్శకత్వం వహించారు. దాదాపు 96 నిమిషాల నిడివి కలిగిన ఈ సినిమాను ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ అనుబంధ సంస్థ పిక్సర్ నిర్మించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తన తోటి మిత్రులతో ఐస్ హాకీ ఆడే సమయంలో 13 ఏళ్ల రిలే అండర్సన్ జీవితంలోకి ఆందోళన, అసంతృప్తి, సిగ్గు, అసూయ ప్రవేశిస్తాయి. ఆ క్షణం నుంచి సినిమా ఎన్ని మలుపులు తీసుకుందనేది దర్శకుడు చాలా వినోదాత్మకంగా చూపించారు. టీనేజర్లను విపరీతంగా ఆకట్టుకునేలా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రస్తుతం కుటుంబ సమేతంగా ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే ఈ సినిమా మరిన్ని రికార్డులు సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

హారర్ మిస్టరీ...



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా ఓ హారర్ మిస్టరీ సినిమాలో నటిస్తున్నారు. 'చావు కబురు చల్లగా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. సతీశ్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ అందించారు. జూలై 11 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, ఇప్పటివరకూ ఎవ్వరూ తీయని కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటర్: నిరంజన్ దేవరమానే, డీఓపీ: చిన్మయ్ సలాస్కర్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్.

సునయన పెళ్లి అతనితోనేనా?



'కుమారి వర్సెస్ కుమారి' చిత్రంతో వెండితెర ప్రవేశం చేశారు సునయన. 'రాజరాజచోర' చిత్రంతో హిట్ అందుకుని ఆ తర్వాత కొన్ని సినిమాలు, 'మీట్ క్యూట్', 'ఇన్‌స్పెక్టర్ రిషి' వెబ్ సిరీస్‌లో నటించారు. కొన్ని రోజుల క్రితం తనకు నిశ్చితార్థం అయ్యిందని సోషల్ మీడియాలో ప్రకటించి.. తన కాబోయే భర్త వేలు పట్టుకున్న ఫొటోను షేర్ చేశారు. కానీ తను పెళ్లాడబోయే వ్యక్తి పేరు మాత్రం చెప్పకుండా అందరినీ సస్పెన్స్‌లో పెట్టారు. తాజాగా, ఆమె పెళ్లి చేసుకోబోయేది దుబాయ్‌కు చెందిన ఖలీద్ అల్ అమేరి అనే యూట్యూబర్‌ను అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం జూన్ 26న ఖలీద్ అల్ అమేరి తన ఇన్‌స్టా ఖాతాలో ఓ అమ్మాయితో ఉంగరాలు మార్చుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. దీంతో సునయన నిశ్చితార్థం చేసుకున్న వ్యక్తి.. పెళ్లి చేసుకోబోయేది ఖలీల్‌నే అని అందరూ అనుకుంటున్నారు. కాగా, ఖలీల్‌కు ఇప్పటికే సలామా మొహమ్మద్‌తో పెళ్లయిందని, ఫిబ్రవరి 14న వారిద్దరూ విడాకులకు అప్లై చేయగా వెంటనే విడాకులు మంజూరు అయ్యాయట. ఈ విషయాన్ని స్వయంగా ఖలీల్ భార్య సలామానే చెప్పారు.

రామ్‌చరణ్ సొంత చిత్రంలో నిఖిల్



వి మెగా పిక్చర్స్ పతాకంపై చిత్రాలు నిర్మించడానికి హీరో రామ్‌చరణ్ నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. యూవీ క్రియేషన్స్ విక్రమ్‌రెడ్డి ప్రొడక్షన్ పార్ట్‌నర్. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ వీరిద్దరితో చేతులు కలిపారు. నిఖిల్ హీరోగా నిర్మించే తొలి చిత్రం 'ది ఇండియా హౌస్' నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించే ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషించనున్నారు. 1905వ సంవత్సరం నేపథ్యంగా ప్రేమ, విప్లవం అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ హంపీలోని విరూపాక్ష దేవాలయంలో ప్రారంభమైంది. మంగళవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. ఈ చిత్రానికి కెమరూన్ బ్రైసన్ ఛాయాగ్రాహకుడు.

ఐదుగురు స్నేహితుల వినోదం



ఎమ్మెస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల మధ్య జరిగే సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విస్కి దర్శకత్వంలో బొమ్మా బొరుసా సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు విస్కి మాట్లాడుతూ 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యావసానాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఈ నెల 19న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/U7EeSaE లో చదవండి.

విద్యాభివృద్ధికి కృషి చేయండి: కూన

ఆమదాలవలస: ఆమదాలవలస కస్తూర్బా బాలికల, జ్యోతీరావుపూలే, మోడల్ పాఠశాలల ద్వారా విద్యాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాయంలో ఆయా పాఠశాలల అధికారులతో ఎమ్మెల్యే రవికుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వివిధ విభాగాల్లో ఉన్న విద్యా సంస్థలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కిడ్నీ వ్యాధి మూలాలపై పరిశోధిస్తాం

● జార్జి ఇనిసిట్యూట్ ఈడీ వివేకానంద జా


ఎమ్మెల్యే అశోక్‌తో మాట్లాడుతున్న వైద్యుల బృందం

కవిటి: రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసి ఉద్దానం కిడ్నీ వ్యాధి మూలాలపై పరిశో ధిస్తామని జార్జి ఇనిసిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేకానంద జా తెలిపారు. సోమవారం కవిటి సీహెచ్‌సీలో వైద్యులతో సంప్రదించిన ఆయన ఆ తర్వాత ఎమ్మెల్యే బి.అశోక్‌తో మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ భారం 21శాతం ఉందని, మూల కారణాలను కనుగొనే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కొలంబియా మెడికల్ సెంటర్, యునైటెడ్ స్టేట్స్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌తో కలిసి నిర్వహిస్తున్న ప్రాజెక్టు గురించి చర్చించారు. కవిటి, సోంపేట ప్రాంతాల్లో రోగులను పరిశీలించారు. రోగులు ఆహారపు అలవాట్లు, వాడు తున్న మందులు వివరాలను తెలుసుకున్నారు. వైద్యులు బాలాజీ, దిలీప్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

అలరించిన స్వర నీరాజనం

శ్రీకాకుళం కల్చరల్: సినీ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా బాపూజీ కళామందిర్‌లో సోమవారం బాలూ స్వర నీరాజన కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కళాకారుల వల్ల సిక్కోలుకు ఎంతో పేరు వచ్చిందన్నారు. కల్యాణం రామ్మోహన్, కేఎల్ఎన్ మూర్తి, నివాస్, మంగవేణి, సతీష్ తదితరులు గీతాలాపన చేశారు. సభా అధ్యక్షులుగా పులఖండం శ్రీనివాసరావు వ్యవహ రించగా, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, బలివాడ మల్లేశ్వరరావు కె.దుర్గా శ్రీనివాసరావు, పి.వైకుంఠరావు, కేఎల్ఎన్ మూర్తి, ఎం.వి.కామేశ్వరరావు, నిక్కు అప్పన్న, బండారు చిట్టిబాబు, రమణమూర్తి, డాక్టర్ సంపత్ కుమార్, సురంగి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీవీఈవో బాధ్యతల స్వీకరణ



గుజరాతీపేట: జిల్లా వృత్తి విద్యాశాఖాధికారిగా శివ్వాల తవిటి నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీవీఈవోగా పనిచేసిన కోట ప్రకాశరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. అతని స్థానంలో తవిటినాయుడుకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియట్ కమిషనర్ నిధి మీనా ఉత్తర్వులు జారీ చేశారు. తవిటినాయుడు నియామకంపై ప్రిన్సిపాల్ వి.నారాయణస్వామి, ఇతర అధ్యాపకులు, కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నదిలో జారిపడిన యువతి


యువతిని కాపాడిన టూటౌన్ పోలీసులు

శ్రీకాకుళం క్రైం: స్థానిక డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో ఉన్న నాగావళి బ్రిడ్జి పై నుంచి ఓ యువతి జారిపడగా, పోలీసులు కాపాడిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. డేఅండ్ నైట్‌లో ఓ బైక్ షోరూమ్‌లో పనిచేస్తున్న మంజు అనే యువతి సోమవారం సాయంత్రం నాగావళి బ్రిడ్జి మీద నుంచి జారిపడి పోయింది. ఇది గమనించిన స్థానికులు టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించగా.. హుటా హుటిన టూటౌన్ సిబ్బంది అక్కడకు చేరుకుని యువతిని కాపాడారు. 108 వాహనంలో రిమ్స్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆ యువతి పరిస్థితి బాగానే ఉన్నట్టు వైద్యులు ధ్రువీకరించారు.

రాజీపడలేదని మహిళపై దాడి

● దాడికి పాల్పడిన సస్పెక్ట్ షీటర్ ఆకుల సురేష్

శ్రీకాకుళం క్రైమ్: ఏడాది కిందట ఓ మహిళపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటనలో నిందితుడైన సస్పెక్ట్ షీటర్ ఆకుల సురేష్.. కేసు రాజీ చేసుకోలేదన్న కోపంతో మరోసారి ఆ మహిళపై దాడి చేసిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని హయాతీనగరం సమీపంలోని రెల్లవీధిలో నివసిస్తున్న ఆకుల సురేష్ ఆదివారం రాత్రి షైలపిల్లి హేమ తన కుమారుడుకి చికిత్స చేయించేందుకు రిమ్స్‌కు వెళ్లి భర్త కొర్లయ్యతో తిరిగి వస్తుండగా గూనపాలెం రామమందిరం వద్ద దాడి చేశాడు. న్యాయస్థానంలో కేసు రాజీకి ఎందుకు అంగీకరించలేదంటూ దుర్భాష లాడుతూ ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో హేమకు గాయాలు కావడంతో భర్త సాయంతో రిమ్స్‌కు తరలించారు. ఎంఎల్‌సీ రిపోర్టు ఆధారంగా సస్పెక్ట్ షీటర్ సురేష్‌పై వన్ టౌన్ ఎస్ఐ కామేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా కొద్ది రోజుల కిందట మంగు వారితోటలో వివాహిత కిడ్నాప్ కేసులో కూడా ఆకుల సురేష్ ఆమె భర్తపై దాడి చేసి కిడ్నాప్ చేయడంలో కీలకపాత్ర పోషించినట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే ఆకుల సురేష్‌పై సస్పెక్ట్ షీట్ ఉండడంతో అతడు పదే పదే నేరాలకు పాల్పడుతుండడంతో అతనిపై రౌడీషీట్ తెరిచేందుకు 1టౌన్ పోలీసులు ఎస్పీకి నివేదిక అందించనున్నారు.

ఘనంగా ఎంజీఆర్ పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

హిరమండలం: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) పుట్టిన రోజు వేడుకలు సోమవారం హిరమండలం, గులుమూరు గ్రామాల్లో నేతలు ఘనంగా నిర్వహించారు. చిన్నకోరాడ వద్ద నందిగాం సాయిక్రిష్ణ పట్నాయక్ ఆధ్వర్యంలో ఎంజీఆర్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. లాడే కృష్ణ 300 మంది పేదలకు వస్త్రాలు పంపిణీచేశారు. ధనుపురంలో సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, నేతలు జి.కామేశ్వరరావు, మల్లవరపు హరి, వడ్డి సింహాచలం, లింగుబేరి సింహాచలం, దంత తేజ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవృత్తి పవిత్రమైంది



వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

పలాసరూరల్: వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని, ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులను అందరూ గౌరవించాలని వక్తలు అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో డాక్టర్స్‌డే సందర్భంగా ప్రముఖ వైద్యులు మోహన్‌బాబు, అమర్‌నాథ్, సాయితేజలను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుచేయాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని జిల్లా దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ధర్నా చేపట్టారు. పూర్వపు వీసీ చేపట్టిన నియామకాలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే వర్సిటీలో అంబేడ్కర్ చైర్‌ను తక్షణమే నెలకొల్పాలన్నారు. ఎలాంటి రిజర్వేషన్లు పాటించకుండా గత వీసీ చేపట్టిన 34 మంది బోధనేతర సిబ్బంది నియామకాలను వెంటనే రద్దు చేయాలన్నారు. తొలుత ఎచ్చెర్ల ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా వర్సిటీకి చేరుకుని.. వర్సిటీ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఆ నియామకాలను రద్దుచేయకపోతే ఆగస్టు 5న వర్సిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దుర్గాసి గణేష్, టొంపల రమణ, బెలమర ప్రభాకర్, బోనెల అప్పారావు, వన్నాళి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో శ్రీకాకుళంలో సంగీత విభావరి

● నేపథ్య గాయకుడు మనో


మాట్లాడుతున్న మనో

శ్రీకాకుళం కల్చరల్: త్వరలో శ్రీకాకుళంలో సంగీత విభావరి నిర్వహిస్తానని ప్రముఖ నేపథ్య గాయకులు నాగూర్‌బాబు (మనో) తెలిపారు. శ్రీకాకుళం నగరానికి విచ్చేసిన ఆయనను అరసవల్లి గెస్ట్‌హౌస్‌లో శ్రీసుమిత్రా కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకర్ శర్మ, గుత్తు చిన్నారావు కలుసుకున్నారు. వారి విన్నపం మేరకు జిల్లా కేంద్రంలో సినీ సంగీత విభావరి నిర్వహణకు అంగీకరించారు. గతంలో తమ సంస్థ ఆధ్వర్యంలో జేసుదాసు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత విభావరులను నిర్వహించామన్నారు. ఈ ఏడాదిలోనే మనో సంగీత విభావరి ఉంటుందని హామీ ఇచ్చారని ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. ఉత్తరాంధ్రాతో పాటు స్థానిక కళాకారులతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మనో గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ సాంస్కృతిక శాఖ కన్వీనర్ గుత్తు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

దోమలను అరికట్టడంతో డెంగ్యూ నివారణ

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. సోమవారం నుంచి 31 వరకు డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు డెంగ్యూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ వ్యాధి దోమకాటు ద్వారా వ్యాపిస్తుందని, ప్రతీ ఒక్కరూ దోమతెరలను వాడాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇంటిలో వాడని పాత్రల్లో నీటి నిలువలు ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.బి.మీనాక్షి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్మోహన్‌రావు, డీఐవో శ్రీదేవి, డీపీఎంవో డాక్టర్ జీవీ లక్ష్మి, మున్సిపల్ హెల్త్ అధికారి వెంకటరావు, సంఘ సేవకుడు మంత్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'స్టాప్ డయేరియా' మాసోత్సవాలు ప్రారంభం

కలెక్టరేట్: జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి 31వరకు 'స్టాప్ డయేరియా' అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఈ మేరకు కలెక్టర్ స్టాప్ డయేరియా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మందులు లభ్యత, వాటి నాణ్యతను పరిశీలించి వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో బి.మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: అధికారం శాశ్వతం కాదని, అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు పని చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో పనులు గాలికొదిలేయడంతో శివారు ప్రాంతాలకు సాగునీరందలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు శివారు ప్రాంతాల భూములకు సాగునీరందించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు వంశధార అధికారులకు సూచనలు చేశారన్నారు. ఇప్పటికే రైతులకు ఎరువులు, విత్తనాలు అందించినట్లు అధికారులు చెప్పడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మెండ విజయశాంతి, తహసీల్దార్ నాగలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన రమణమూర్తిని పలువురు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు సత్కరించారు.

తీరం కోతకు గురికాకుండా చర్యలు:శంకర్

శ్రీకాకుళం రూరల్: తీరం కోతకు గురికాకుండా చర్యలు చేపడతామని వీజీ పేట మత్స్యకారులకు ఎమ్మెల్యే గొండు శంకర్ భరోసానిచ్చారు. పెద్దగనగళ్లవానిపేటలో నాగావళి నది కలిసే సముద్రతీర ప్రాంతాన్ని మత్స్యకారులతో కలిసి సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీ లించారు. నాగావళి వరదల కారణంగా తీరం భారీగా కోతకు గురికావడంతో పాటు సమీపంలోని అక్రమ చేపల చెరువుల తవ్వకాల వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాంతాలను పరిశీ లించిన శంకర్ తీరం కోతకు గురికాకుండా చర్యలు తీసు కుంటామని హామీనిచ్చారు. అలాగే మత్స్య కారుల సమస్యలను పరిష్కరిస్తామని గొండు శంకర్ పేర్కొన్నారు.

బ్యారేజి సమస్యల పరిష్కారానికి కృషి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

హిరమండలం: బ్యారేజీ వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాత పట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గొట్టా బ్యారేజీ ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల అనంతరం వంశధార అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బ్యారేజీ, కాలువల నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేరని అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనివల్ల ఖరీఫ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. లస్కర్ల కొరత ఎక్కువగా ఉందని, కార్యాలయం వద్ద ఒకరిద్దరు సిబ్బందే బ్యారేజీ నిర్వహణ చూడాల్సి వస్తోందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బ్యారేజీ పొడవున విద్యుత్ దీపాలు గత కొన్నేళ్లుగా ఏర్పాటు చేయక పోవడంపై ఆయన అసహనం వ్యక్తంచేశారు. తక్షణం మీరు బల్బులు వేస్తారా, నేనే సొంత నిధులతో వేయించాలా అని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, వంశధార ఈఈ ఎంవీరమణ, డీఈలు ఎం.రంగనాయకులు, బగ్గు సత్యనారాయణ, ఏఈలు ధనుం జయరావు, పి.సుద్దబాబు, టీడీపీ నాయకులు తూలుగు తిరుపతిరావు, యాళ్ల నాగేశ్వ రరావు, చెట్టు శ్రీనివాసరావు, దారపు ఢిల్లేశ్వరరావు, లాడె కృష్ణ, గోళ్ల సింహాచలం, కామేశ్వ రరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీపై ఎమ్మెల్యే ఆగ్రహం

యంబరాం(ఎల్.ఎన్.పేట): యంబరాం గ్రామంలో మాజీ సీఎం జగన్, దివంగత సీఎం వైఎస్ఆర్ ఫొటోలున్న వాహనంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం గ్రామానికి వచ్చిన ఆయన వచ్చిన సమయంలో ఎస్సీ వీధిలో రేషన్ పంపిణీ చేస్తున్నారు. రేషన్ వ్యాన్‌పై వైసీపీ పథకాలు, ఫొటోలు ఉండడాన్ని గమనించిన ఎమ్మెల్యే వ్యాన్ డ్రైవర్, డీలర్, రెవెన్యూ కార్య దర్శిపై ఆగ్రహించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాణి అమ్మాజీని ఆదేశిం చారు. వెంటనే సంబంధిత రాష్ట్ర మంత్రితో ఫోన్ చేయించారు. ఈ మేరకు ఆ ముగ్గురికి తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి నోటీసులు అందజేశారు.

బీఆర్‌ఏయూ ఓఎస్డీగా కావ్యజ్యోత్స్న

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా సోషల్ వర్క్ విభాగానికి చెందిన అధ్యాపకురాలు యు.కావ్యజ్యోత్స్న నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని వీసీ కేఆర్ రజని సోమవారం కావ్యజ్యోత్స్నకు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత పాల్గొన్నారు. కావ్యజ్యోత్స్న వర్సిటీలో సీడీసీ డీన్‌గా వ్యవహరిస్తున్నారు.

మంత్రి దృష్టికి 'తోటపల్లి' సమస్యలు

జి.సిగడాం: తోటపల్లి బ్యారేజ్ జలాశయం సమస్యలపై జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తాళాబత్తుల పైడిరాజు సోమవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి వినతి పత్రం అందజేశారు. కాలువల్లో పూడికలు తీయించాలని, శివారు భూములకు సాగునీరందించాలని, ఖాళీగా ఉన్న లష్కర్‌లను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై సాను కూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: మదుపాం పంచాయతీ నల్లిపేటలో సోమవారం అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేసారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కిల్లిపోలమ్మ సంబరాలు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ గొల్లవీధిలో కిల్లి పోలమ్మతల్లి సంబరాలు సోమ వారం ఘనంగా జరిగాయి. అమ్మవారిని పురవీధుల్లో తప్పెటగుళ్లు, మేళ తాళాలతో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి చల్లదనం చేశారు. చుట్టాళ్లు, బంధువులతో కళకళలాడింది.

పుస్తకాల వితరణ

జి.సిగడాం: కొత్తపేట గ్రామానికి చెందిన శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ కాయల రవి స్థానిక శాఖా గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలను సోమవారం అందజేశారు. సుమారు రూ.15 వేలు విలువచేసే డీఎస్సీ, ఎస్ఎస్సీ, గ్రూప్-2 పుస్తకాలు అందించారు. శాఖా గ్రంథాలయాధికారి సీహెచ్ వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

29 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కొత్తూరు: పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా నివగాం గ్రామం వద్ద సోమవారం సీఎస్‌డీటీ రవికుమార్ పట్టుకున్నారు. లగేజీ వాహనంలో రైస్‌మిల్లు యజమాని ఇప్పిలి ఆనందరావు 29 క్వింటాళ్ల రేషన్ తరలిస్తున్నారని, ఆయనపై 6ఎ కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

పొందూరు: పొందూరు పట్టణానికి తాగునీరందించే పైపులైన్ల మరమ్మతులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. సోమవారం నుంచి పట్టణానికి నీటిసరఫరా ప్రా రంభమైంది. పైపులైన్లు పాడవడంతో మూడు నెలలుగా నీటికోసం ఇబ్బంది పడ్డారు. సమస్య ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి వెళ్లడంతో తక్షణమే మరమ్మతులు పూర్తి చేసి నీరందించాలని సూచించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ మరమ్మ తులకు అవసరమైన సామగ్రిని సమ కూర్చడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులు పూర్తిచేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

వెంకయ్యనాయుడుకు అభినందన

నరసన్నపేట: స్థానిక బ్రహ్మ కుమారీ సంస్థకు చెందిన ప్రతినిధులు సోమవారం మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును కలిసి అభినందించారు. ఆయన 75వ జన్మదినం సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతారావు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు: జేసీ


పింఛన్ అందిస్తున్న జేసీ నవీన్

నరసన్నపేట: సామాజిక పింఛన్ల పంపిణీలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు ఫిర్యాదులు వస్తే తగు చర్యలు తీసుకుంటామని జేసీ నవీన్ స్పష్టం చేశారు. సోమవారం పింఛన్ల పంపిణీ ప్రక్రియను బొరిగివలస గ్రామంలో పరిశీలించారు. రెండు రోజుల్లో శతశాతం పింఛన్ల పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకారావు, తంగి తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేపట్టారు.

కొత్త చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గార: కొత్త చట్టాలపై జిల్లా జైలులో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు ఖైదీలకు అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయంపై వివరించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలర్ జీఎస్ దివాకర్ నాయుడు, డిప్యూటీ జైలర్ ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

శ్రీకాకుళం క్రైమ్: రాష్ట్రంలో నూతన చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి రావడంతో రెండో పట్టణ పోలీసు సిబ్బందికి, విద్యార్థులకు సోమవారం సీఐ జి.ఉమామహేశ్వరరావు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలను అమలు చేయడంతో ప్రతీ సిబ్బంది దీనిపై అవగాహన కలిగి ఉండాలని సీఐ వివరించారు. కార్యక్రమంలో సీఐతో పాటు ఏఎస్ అరుణకుమారి, హెచ్‌సి తేజ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలు అమలు ఆపాలి

ఆమదాలవలస: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలు అమలు నిలిపివేయాలని ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయ వాదులు హనుమంతు ప్రసాదరావు, గురుగుబెల్లి ప్రభాకరరావు, గోవిందరాజులు, ప్రసాదరావు, అచ్చెన్నాయుడు, విజయకుమార్ పాల్గొన్నారు.

నెలవంకలో అగ్నిప్రమాదం: 13 మేకలు మృతి

కవిటి: మండలంలోని నెలవంకలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 13 మేకలు మృతి చెందాయని బాధితురాలు దుర్గాసి శ్యామల తెలిపారు. గ్రామానికి సమీ పంలోని తోటలో ఉన్న షెడ్‌లో మేకలను కట్టివేసి ఇంటికి చేరుకున్నారు. చీకటి పడిన తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు షెడ్‌కు నిప్పు పెట్టారని ఆమె వాపోయింది. గ్రామస్థులు చూసి విషయం చెప్పడంతో తోటకు వెళ్లే సరికి షెడ్‌లో మేకలు మృతిచెంది ఉన్నాయని తెలి పింది. కుటుంబ పోషణకు ఆధారమైన వాటిని కోల్పోవడంతో శ్యామల తీవ్రంగా రోదిస్తోంది.

ఏడాదిలో 500 సేవా కార్యక్రమాలు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 2023-24లో 500 సేవాకార్యక్రమాలు నిర్వహించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ.. సోంపేటలో సులభ్ కాంప్లెక్స్, కంచిలిలో స్వర్గధామం నిర్మాణంతోపాటు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సి పరుషులు, విద్యాపరికరాలు పంపిణీ చేపట్టామన్నారు. ఆసుపత్రుల అభివృద్ధికి వస్తువులను సమకూర్చినట్లు తెలిపారు. సమావేశంలో కార్యదరి కృష్ణారావు, ట్రెజరర్ రవికుమార్ పాల్గొన్నారు.

టెక్కలి ఆర్టీసీ డిపోను పరిశీలించిన ఈడీలు

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ డిపోను ప్రజారవాణా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సి.రవికుమార్, బ్రహ్మానందరెడ్డి, రవివర్మ, చంద్రశేఖరరావు సోమవారం పరిశీలించారు. ఆర్టీసీ ఆధీనంలో ఉన్న స్థలాల వివరాలపై ఆరా తీశారు. డిపో పరిధిలో ఉన్న బస్సులు, కాలంచెల్లిన బస్సులు ఏయే రూట్లలో సర్వీసులు నడిపించాలన్న దానిపై డిపో మేనేజర్ శ్రీనివాసరావుతో మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఆయా రూట్లలో అవసరమైన కొత్త బస్సులు నడిపించాలని డీఎంకు సూచించారు. వారితో పాటు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ ఉన్నారు.

రక్తదానంపై అవగాహన కల్పించండి

టెక్కలి: రక్తదానంపై యువతకు మరింత అవగాహన కల్పించాలని ఐతం కళాశాల చైర్మన్ డాక్టర్ కె.సోమేశ్వరరావు అన్నారు. సోమవారం డాక్టర్స్‌డేని పురస్కరించుకుని కళాశా లలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో 98 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవో కె.మా రుతీప్రసాద్, రోటరీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడామంత్రిని కలిసిన క్రీడాకారులు

టెక్కలి: రాష్ట్ర రవాణా, క్రీడా శాఖామంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సోమవారం తైక్వాండో క్రీడాకారులు కలిశారు. తైక్వాండో పోటీలో జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించిన మెండ తపస్వి, లక్ష్మీలతకు మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్, తైక్వాండో కోచ్‌లు నర్సిపురం శేఖర్, సురేష్, జగదీష్ పాల్గొన్నారు.

జనజాగృతి నూతన కార్యవర్గం ఎన్నిక

పలాసరూరల్: జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సర్వసభ్య సమావేశం సోమవారం వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. 2024-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమార్‌నాయక్, కార్య దర్శిగా బండారు కాళీదాస్, కోశాధికారిగా బాలకృష్ణవర్మ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస బాబ్జీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గాయపడిన కార్యకర్తకు పరామర్శ

టెక్కలి: నిమ్మాడ వస్తూ ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎండ నర్సింహమూర్తిని సోమవారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మంత్రులకు రవాణా శాఖాధికారుల సత్కారం


మంత్రులను సత్కరిస్తున్న రవాణాశాఖాధికారులు

టెక్కలి: రాష్ట్ర వ్యవ సాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రవాణా శాఖా మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డిలను రవాణా శాఖాధికారులు సోమవారం సత్కరించారు. డీటీసీ ఎ.చంద్రశేఖర రెడ్డితో జిల్లాకు సంబంధించిన వివరాలను వారు ఆరా తీశారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి తనిఖీ చేసే బ్రీత్ ఎనలైజర్లు పాతవి కావడంతో మూలకు చేరా యని, కార్యాలయ ట్యాబ్‌లు, కంప్యూటర్లు పాత బడ్డాయని డీటీసీ మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఆర్టీవోలు, ఎంవీఐ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీవో దేవి, ఎంవీఐలు డి.సంజీవరావు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

హరిపురం: మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అటవీ శాఖ సెక్షన్ అధికారి (సామాజిక విభాగం) ఆర్.తుంబేస్ అన్నారు. అంబుగాం హైస్కూల్ ఆవరణలో ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 రకాల మొక్కలను సుమారు 500 నాటారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక ఏడాది పాటు ఒక్కో మొక్క సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీతమ్మ, అటవీశాఖ బీట్ అధికారి పోలయ్య, సోమేశ్వరరావు, పి.రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి నిమ్మాడ-విశాఖ బస్సు సర్వీసు

టెక్కలి: టెక్కలి డిపో పరిధిలోని బోరుభద్ర, నిమ్మాడ-విశాఖ బస్సు సర్వీసును మంగళవారం నుంచి నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు బయలుదేరు బస్సు రావివలస మీదుగా బోరుభద్ర వయా నిమ్మాడ మీదుగా నరసన్నపేట, శ్రీకాకుళం, విశాఖ చేరుకొని, విశాఖ నుంచి నేరుగా టెక్కలి డిపోకు చేరుకుంటుందన్నారు. ఈ రూట్‌లో మత్స్యకారులకు, విశాఖ వెళ్లే వారికి ఈ సర్వీస్ ఉపయోగపడుతుందని మంత్రి అచ్చెన్నాయుడు సూచనల మేరకు నడుపుతున్నామన్నారు.

పౌష్టికాహారం అందించాలి

మెళియాపుట్టి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు చిన్నారులకు విద్యా బోధన చేపట్టాలని పాతపట్నం ఐసీడీఎస్ సీడీపీవో విమల కుమారి అన్నారు. సోమవారం చాపరలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రానికి రోజూ పిల్లలు వచ్చేలా చర్య లు తీసుకోవాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన

మెళియాపుట్టి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగుతోందని ఎంఈవోలు దేవేంద్రరావు, పద్మనాభం అన్నారు. సోమవారం మెళియాపుట్టిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణపతిరావుతదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ లేక ఇబ్బందులు

మెళియాపుట్టి/పలాస/పలాస రూరల్: పింఛన్ల పంపిణీకి సంబంధించి మెళియాపుట్టి, పలాసల్లో నెట్‌వర్క్, సర్వర్ సమస్యతో ఇబ్బందులు తలెత్తాయి. మెళియా పుట్టి మండలంలోని గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ లేక సచివాలయ సిబ్బంది గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కేరాశింగి, చందనగిరి, పోగడవల్లి గ్రామాల్లో ఈ సమస్య ఏర్పడడంతో నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాలకు లబ్ధిదారులను కూటమి నాయకులు తీసుకువచ్చి పింఛన్లు పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా పలాస మండలం పెదంచల గ్రామంలో ఉదయం పెన్షన్ల పంపిణీలో కొంత గందరగోళ వాతావరణం నెలకొంది. పింఛన్ల లిస్టులో కొందరి పేర్లు రాని విషయమై గందగగోళం తలెత్తింది. వారంతా పెదంచల సచివాలయం వద్దకు చేరుకొని వెల్ఫేర్ అధికారి రవిని అడిగారు. దీనిపై సచివాలయ అధికారులు వారి పేర్లు పరిశీ లించి పింఛన్లు యథావిధిగా పంపిణీ చేశారు. పెన్షన్ల పంపిణీలో ఎవరికీ నిలుపుదల చేయలేదని, అందరికీ పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు తెలిపారు.

సర్వీసు రోడ్డు మంజూరు చేయాలని వినతి

ఎచ్చెర్ల: పొన్నాడ బ్రిడ్జి నుంచి కొండ వరకు 150 మీటర్ల పొడవునా సర్వీసు రోడ్డు మంజూరు చేయాలని సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు పొన్నాడ మాజీ సర్పంచ్ పంచిరెడ్డి కృష్ణారావు వినతి పత్రాన్ని అందజేశారు. దీనివల్ల పొన్నాడ కొండపై ఉన్న ఇస్కాన్ మందిరంతో పాటు ఏర్పాటు కానున్న శిల్పారామం, మురుగు నీటి శుద్ధి కర్మాగారం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శిక్షణా కేంద్రం, ఏపీ టూరిజం హబ్ తదితర వాటికి రోడ్డు సౌకర్యం మెరుగుపడుతుందని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా పింఛన్ల మొత్తం పెంచారు. ఆయన చెప్పినట్లే ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అదనంగా ఇవ్వాల్సిన వెయ్యేసి రూపాయలతోపాటు జూలైలో పెంచిన రూ.4 వేలు కలిపి సోమవారం మొత్తం రూ.7 వేలు అవ్వ, తాతలకు, వితంతువులకు అందించి నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. దివ్యాంగులకు కూడా పెంచిన పింఛన్ అందించడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు అందించారు.

పింఛన్ భరోసా

- ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదు అందజేత
- జిల్లాలో పండగ వాతావరణం
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం
- హర్షం వ్యక్తం చేస్తున్న అవ్వ, తాతలు, వితంతువులు
- పింఛన్ మొత్తం పెంపుతో దివ్యాంగుల్లో సంతోషం



పింఛన్ డబ్బులు అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాష్ట్రాన్ని దోచుకుతిన్న.. జగన్ రెడ్డి

టెక్కలి: ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం సంక్షేమం మరిచి రాష్ట్రాన్ని దోచుకు తిన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం కోటబొమ్మాళి మండలం తర్లిపేటలో రాష్ట్ర రవాణామంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లతోపింఛన్ల పంపిణీ జరగకుండా ఆపి సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయాలని తాము కోరినప్పటికీ జగన్‌రెడ్డి మొండివైఖరి వల్ల రాష్ట్రంలో 35మంది వృద్ధులు మృత్యువాతపడ్డారని గుర్తుచేశారు. అదే సచివాలయ సిబ్బందితో నేడు పింఛన్లను పంపిణీ చేయిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో నేతలు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, అప్పన్న, నంబాళ్ల శ్రీనివాస్, నంబాళ్ల రాజశేఖర్, కర్రి అప్పారావు, కింజరాపు సురేష్ తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం: ఎన్ఈఆర్

జి.సిగడాం/ రణస్థలం/ ఎచ్చెర్ల/ లావేరు: కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం మండల కేంద్రం, పాలఖండ్యాం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు విశ్వక్షేన్, కుమరాపు రవికుమార్, వజ్జిపర్తి రఘురాం తదితరులు పాల్గొన్నారు. రణస్థలం మండలం కొండములగాం, జేఆర్ పురం గ్రామాల్లో పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కూటమి నాయకులు దన్నాన సత్తిబాబు, దన్నాన స్వామినాయుడు, అడపా సూర్యారావు, డీజీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జేఆర్ పురం పంచాయతీ కాపివీధిలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ పింఛన్లు పంపిణీ చేశారు. ఎచ్చెర్ల మండలంలో ఎచ్చెర్ల, చిలకపాలెం, భగీరథపురం, డి.మత్స్యలేశం, గిన్నివానిపేట తదితర గ్రామాల్లో ఎన్ఈఆర్ పర్యటించి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పైడి వేణుగోపాలం, బెండు మల్లేశ్వరరావు, వావిలపల్లి రామకృష్ణ, గాలి వెంకటరెడ్డి, విశ్వక్షేన్, మెండ రాజారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్ఎం పురం గ్రామంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్, మాజీ ఎంపీటీసీ గొంటి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. లావేరు మండలంలో సుభద్రాపురం, లావేరుల్లో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ లక్ష్మీదేవి, కూటమి నాయకులు ముప్పిడి సురేష్, విశ్వక్షేన్, ఐ.తోటయ్యదొర తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: ఎస్ఎం పురంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, పార్టీ నాయకులు



ఎన్నికల హామీని సీఎం నెరవేర్చారు: శిరీష

పలాసరూరల్/ వజ్రపుకొత్తూరు/ హరిపురం/ మందస/ పలాస: పింఛన్ల మొత్తం పెంచి ఇస్తానని ఎన్నికలకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తరువాత సీఎంగా అమలు చేసి లబ్ధిదారుల్లో వెలుగులు నింపారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం పలాస మండలం బ్రాహ్మణతర్లా, గురుదాసుపురం, వజ్రపుకొత్తూరు మండలం చినవంక, గణుపల్లి, చీపురుపల్లి, మందస మండలం దున్నూరు, మందస పట్టణంలో పెంచిన పింఛన్ల మొత్తాన్ని బకాయిలతో కలిపి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. చినవంకలో సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, జన సేన నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు, సర్పంచ్‌లు రూపవతి, దువ్వాడ విజయలక్ష్మి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ హేంబాబు చౌదరి, నాయకులు రెయ్య నాగార్జున్ సూరాడ మోహనరావు, పీరుకట్ల విఠల్, దానేటి పద్మజీ, పలాస ఆర్డీవో భరత్ నాయక్, భావన దుర్యోధన, మాజీ సర్పంచ్ డొంకురు తిరుపతి,టీడీపీ నాయకులు దాసరి తాతారావు, ఎంపీడీవోలు తిరుమలరావు, రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హామీని నెరవేర్చిన ఘనత చంద్రబాబుదే: మామిడి

ఎల్ఎన్ పేట/ హిరమండలం/ మెళియాపుట్టి/ కొత్తూరు/ పాతపట్నం: ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తం పెంచుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆ హామీని అమలు చేశారని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నా రు. ఎల్ఎన్‌పేట మండలం యంబరాం, కోవిలాం, హిరమండలం మండలం గులుమూరు, హిరమండలం, మెళియాపుట్టి మండలం చాపర, కొత్తూరు మండలంలోని సిరుసువాడ గ్రామాల్లో సోమవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.గిరిబాల, తహసీల్దార్ రాణిఅమ్మాజీ, జెడ్పీటీసీ పి.బుచ్చిబాబు, నాయకులు కలమట సాగర్, కె.కృష్ణమాచారి, వి.గోవిందరావు, కె.మన్మధరావు, వి.ఆనందరావు, ఎస్.తేజేశ్వరరావు, తిరుపతిరావు, కె.అప్పలరాజు, చెట్టు శ్రీనివాసరావు, లాడె కృష్ణ, జి.కామేశ్వరరావు, దారపు డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పాతపట్నం మండలంలో కొరసవాడ, పాతపట్నం, బూరగాం గ్రామాల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీలు ఎమ్మెల్యే పాల్గొన్నారు.



హిరమండలం: గులుమూరులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



హరిపురం: దున్నూరులో శిరీష సమక్షంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగుడు

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి: బగ్గు



పోలాకి: మబుగాంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట/జలుమూరు/పోలాకి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పట్టణంలో హడ్కోకాలనీ, జలుమూరు మండలం లింగాలవలస, చల్లవానిపేట ఎస్సీ కాలనీ, పోలాకి మండలం మబుగాం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తొలి అడుగు పడిందన్నారు. కార్యక్రమంలో కింజరాపు రామారావు, సాసుపల్లి కృష్ణబాబు, ఉణ్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీ టీసీ మెండ విజయశాంతి, చల్లవానిపేట, లింగాలవలస సర్పంచ్‌లు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, మెండ రాంబాబు, ఇన్‌చార్జి ఎంపిడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

సోంపేట: పింఛన్ల విధానంలో తాను చెప్పినమాట ముఖ్య మంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని బారువ, లక్కవరం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, జీకే నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్ మడ్డు గురుమూర్తి, సనపల శ్రీరాంమూర్తినాయుడు పాల్గొన్నారు. పలాసపురంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో భరత్ నాయక్ పాల్గొన్నారు.



కవిటి: పింఛన్లు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

వృద్ధుల ముఖాల్లో సంతోషం చూస్తున్నాం

అరసవల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచనల మేరకు వృద్ధులకు రూ.7000 పింఛన్ అందజేయడంతో వారి ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తోణంగి వెంకన్నయాదవ్ అన్నారు. నగరంలోని 43వ డివిజన్, హయాతీనగరంలో సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న యాదవ్ మాట్లాడుతూ.. గతంలో వృద్ధులకు రూ.3000 పింఛన్ పెంచుతానని చెప్పి అధికారంలోకి వైసీపీ వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏడాదికి రూ.250 పెంచడంతో లబ్ధిదారులను ఆవేదనకు గురిచేసిందన్నారు. అయితే చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెంచిన పింఛన్‌తో కలిపి ఈ నెల రూ.7000 అందించామన్నారు. డివిజన్ పరిధిలో సుమారు 350 మందికి పింఛన్లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్, వీఆర్వో, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వృద్ధునికి పింఛన్‌ను అందిస్తున్న తోణంగి వెంకన్నయాదవ్

సంక్షేమ పథకాల సృష్టికర్త చంద్రబాబు: కూన

ఆమదాలవలస/ బూర్జ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాల సృష్టికర్తగా చరిత్రలో నిలుస్తారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం కొర్లకోట, మునిసిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస, 9, 10, 11 వార్డుల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సనపల డిల్లీశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, తంగి గురయ్య నాగళ్ల మురళీధర్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూర్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. బూర్జ మండలంలోని అన్నంపేటలో దివ్యాంగురాలు తవితమ్మకు రూ.15 వేలు పింఛన్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం అందించారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, ఆనెపు రామకృష్ణంనాయుడు పాల్గొన్నారు.



బూర్జ: పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

తాడివలసలో పింఛన్ల పంపిణీలో వివాదం

పొందూరు: తాడివలసలో ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీలో వివాదం నెలకొంది. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయ కుల సౌజన్యంతో సోమవారం 100 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కాని తాడివలస పంచాయతీలోసర్పంచ్ తమ్మినేని మనెమ్మ, నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఉదయం ఐదు గంటలకు సచివాలయ కార్యదర్శి వెంకటరమణ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది పంపిణీ ప్రారంభించారు. దీంతో గ్రామ టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఆదేశాలతో సర్పంచ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పింఛన్ల పంపిణీని అడ్డుకోవద్దని రవికుమార్ సూచించడంతో సర్పంచ్, నాయకులు పాల్గొనకుండానే పంపిణీ నిర్వహించారు. దీనిపై ఎంపీడీవో ఆదేశాలతో ఈవోఆర్డీ సింహాచలం, ఏపీవో శ్రీనివాసరావు సర్పంచ్‌తో చర్చించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు. దీనిపై కార్యదర్శి మాట్లాడుతూ ముందురోజు సర్పంచ్‌కు సమాచారం ఇచ్చామని తెలిపారు.



సర్పంచ్‌తో మాట్లాడుతున్న అధికారులు




అరసవల్లి: రెల్లవీధిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

నగరంలో పండగ వాతావరణం

అరసవల్లి/ గార: శ్రీకాకుళం నగరంలో ఉదయం ఆరు గంటలకే ఎన్టీఆర్ భరోసా పండుగ మొదలైంది. అధికారులు, కూటమి నాయకులు పలు డివిజన్లలో పింఛన్ల పంపిణీ చేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, బీజేపీ నాయకులు కూటమి శ్రేణులతో కలిసి పంపిణీ చేపట్టారు. చౌదరి సత్యనారాయణ కాలనీ, చల్లావీధి, అన్న క్యాంటీన్ వద్ద, పెద్ద బరాటం వీధి, చిన్నబరాటం వీధి, మహాలక్ష్మినగర్ కాలనీ, మంగువారితోట, సంతోషిమాత గుడి, గూనపాలెం తదితర ప్రాంతాల్లో పంపిణీ చేశారు. కూటమి నాయకులు కవ్వాడి సుశీల, పైడిశెట్టి జయంతి, జామి భీమశంకర్, అంధవరపు సంతోష్, విభూది సూరిబాబు, శవ్వాన ఉమామహేశ్వరి, సకలాబత్తుల శ్రీనివాసరావు, కె.కమల, జి.సుభాష్, డి.రాజు, శవ్వాన వెంకటేశ్వరరావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గార మండలం బూరవెల్లి, పూసర్లపాడు గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

మహనీయుడు..



మాట ఇస్తే వెనక్కి తీసుకోని నైజం ముఖ్యమంత్రి చంద్రబాబు అని మరోసారి నిరూపించుకున్నారు. ఎన్నికల హామీని వెంటనే అమలు చేసి పేద, బడుగు, బలహీన వర్గాలకు తోడుగా నిలిచారు. ఎన్నో కుటుంబాల్లో ఆనందాన్ని నింపిన మహనీయుడు.

- మైలపల్లి నాగరాజు, పొన్నాడ, ఎచ్చెర్ల

అదృష్టం నా గడప తట్టింది



దివ్యాంగుడనైన నా వయస్సు 60 ఏళ్లు. పింఛన్ సొమ్ము ఇంత అందుతుందని ఏనాడూ ఊహించలేదు. అదృష్టం నా గడప తట్టింది. నేను ఇక ఎవరిపైనా ఆధారపడక్కర్లేదు. రెట్టింపు పింఛన్ సొమ్ము దివ్యాంగులకు అందించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- బి.అన్నయ్య, దివ్యాంగుడు, తర్లిపేట, కోటబొమ్మాళి

ఇంటి అవసరాలు గట్టెక్కుతాయి



ఇన్నాళ్లు ఇచ్చిన అరకొర పింఛన్‌తో ఇబ్బందులు పడేదాన్ని. ఇప్పుడు రూ.4 వేలతో ఇంటి అవసరాలు గట్టెక్కుతాయి. ఆపై మిగిలినవి మందులు ఇతర అవసరాలకు ఉపయోగపడతాయి.

- బోటి రాజమ్మ, మేధరవీధి, టెక్కలి

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన మొత్తంతో మూడు నెలల బకాయి అందించిన సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించాలని ఎన్నో దేవుళ్లను మొక్కుకున్నాను. ఇప్పుడు ఇచ్చిన హామీమేరకు పింఛన్ అందించి మాలాంటి కుటుంబాలకు ఆసరాగా నిలిచారు.

- ఎల్.జయలక్ష్మి, చినవంక, వజ్రపుకొత్తూరు

ఇబ్బందులు తీరాయి



గత రెండు నెలలుగా పింఛను అందక తీవ్ర ఇబ్బందులు పడ్డాను. బ్యాంకులో డబ్బులు పడ్డాయన్నారు. బ్యాంకుకు వెళ్లే సత్తువ లేక ఇంటి వద్దనే ఇబ్బందులు పడుతూ ఉండిపోయా. చంద్రబాబు వచ్చి మా ఇబ్బందులు తీర్చారు.

- అగ్గున్న కృష్ణమూర్తి, కాపువీధి, హరిపురం


చంద్రబాబు నా పెద్దకొడుకు



ఒకేసారి రూ.వేయి పెంచి రూ.4 వేలు పింఛన్ ఇస్తున్న సీఎం చంద్రబాబు తనకు పెద్ద కొడుకు వంటివారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చారు. రూ.7 వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది.

- డి.భూదేవమ్మ, ఆమదాలవలస

నూరేళ్లు చల్లగా ఉండాలి



రూ.4 వేలు పింఛనందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు చల్లగా ఉండాలి. పేదల ఆశీస్సులతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలి. ఒకేసారి రూ.వెయ్యి పెంచడం ఆనందంగా ఉంది.

- కూన లక్ష్మి, సరుబుజ్జిలి

కొడుకులేని లోటు తీరింది



నాకు కొడుకులు లేని లోటు ముఖ్య మంత్రి చంద్రబాబు రూపంలో నెర వేరింది. ఎప్పుడూ నేను అనుకోలేదు రూ.7000 పింఛన్ అందుకుంటానని.. ఆనందంగా ఉంది,

- బి.అక్కామ్మ, బంజీరు, మెళియాపుట్టి

ఆనందంగా ఉంది



ఒకేసారి రూ.15 వేలు పింఛన్ ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుంది. తాము ఇంత మొత్తంలో ఒకేసారి పెంచుతారని ఊహించలేదు. తన మందులకు వేరే వారికి అడగకుండా సరిపడా నగదు పింఛన్ రూపంలో వచ్చింది. ఎంతో ఆనందగా ఉంది.

- జోగారావు, దివ్యాంగుడు, సూదికొండకాలనీ, పలాస

అందడం ఆనందంగా ఉంది

పింఛను రూ.7 వేలు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ డబ్బులతో కుటుంబ సభ్యులంతా సంతోషంగా ఉంటాం. చంద్రబాబు నిండు నూరేళ్ల బతకాలి

- సరోజనమ్మ, డొంకలపర్త, బూర్జ

చంద్రబాబు దేవుడు

వృద్ధులకు గౌరవాన్ని పెంచిన చం ద్రబాబు దేవుడు. రూ.4 వేలు పింఛ న్ ఇచ్చి కుటుంబ సభ్యుల దగ్గర గౌరవాన్ని పెంచారు. ఆయన మేలు జన్మలో మరిచిపోలేం. వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా ఎంతో భరోసాని కల్పించింది.

- వై.చిన్నమ్మలు, పెంట, జి.సిగడాం

ఎంతో సంతోషంగా ఉంది



పింఛన్ బకాయిలతో కలిపి రూ.7 వేలు అందిం చగానే సంతోషం కలిగింది. ఎన్నికల్లో కూటమి ప్రభు త్వం ఇచ్చిన హామీని మొదటి నెలలోనే నిలబెట్టుకుంది. మాలాంటి వృద్ధులకు వచ్చే పింఛన్ డబ్బులు మందులుకు ఎంతగానే ఉపయోగపడతాయి. ఇచ్చిన మాట మేరకు పింఛన్ పెంచిన చంద్రబాబుకు మేమంతా రుణపడి ఉంటాం

- దుప్పట్ల యశోదమ్మ, బోరుభద్ర, సంతబొమ్మాళి